సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం । 29 । జనవరి । 2025



వైద్య సేవల్లో నిర్లక్ష్యం తగదు
రోగులకు వైద్యసేవలందించడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం హెచ్చరించారు. 8లో



ఆస్పత్రుల్లో ప్రసవాలతో మేలు
ఇళ్ల వద్ద కాకుండా ఆస్పత్రుల్లో ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ డైరెక్టర్ పద్మావతి సూచించారు. 8లో



మేలు చేసే పోలీసులకు సహకరించాలి
మేలు చేసే పోలీసులకు సహకరించాలని బీఎస్ఎఫ్ కమాండెంట్ విజయ్‌కుమార్ కోరారు. 8లో

సిరి ధాన్యాలే..!

- రోజురోజుకు పెరుగుతున్న తృణధాన్యాల వినియోగం
- విస్తరిస్తున్న సాగు
- మెరుగైన ఆదాయం పొందుతున్న గిరి రైతులు
- పెట్టుబడి సొమ్ము ఇచ్చి ప్రోత్సహిస్తున్న వ్యాపారులు
- **ఇళ్ల వద్దకు వచ్చి కొనుగోలు**
- **అరకు గిరిజన మ్యూజియంలో స్టాల్**



గిరిజన మ్యూజియంలో ఏర్పాటుచేసిన చిరుధాన్యాల స్టాల్

ఏజెన్సీలో చిరుధాన్యాల సాగు చేసే రైతుల దశ తిరిగింది. వీటికి మార్కెట్లో రోజురోజుకు డిమాండ్ పెరుగుతోంది. ఒకప్పుడు ఇంటి అవసరాల కోసం మాత్రమే పండించే చిరుధాన్యాలు ఇప్పుడు వారికి సిరులు కురిపిస్తున్నాయి. గిరి రైతుల వద్దకు వ్యాపారులు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. అంతేకాకుండా పెట్టుబడి సాయం అందించి సాగును ప్రోత్సహించడంతో మంచి ఫలితాలు సాధిస్తూ ఆదాయం పొందతున్నారు.

ఆర్థిక భరోసాతో దశ తిరిగిన గిరి రైతు

అరకులోయ టౌన్: ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో పెరుగుతున్న ఆరోగ్య సమస్యల కారణంగా చిరుధాన్యాల వినియోగం పెరిగింది. తద్వారా గిరిజన రైతులకు మంచి ఆదాయం సమకూరుతోంది. చిరుధాన్యాలకు డిమాండ్ పెరగడంతో అరకు గిరిజన మ్యూజియంలో కూడా విక్రయ స్టాల్ ఏర్పాటుచేశారు. గిరిజన మహిళలు అన్ని రకాల చిరుధాన్యాలతోపాటు అటవీ ఉత్పత్తులను సేకరించి ఈ స్టాల్‌లో విక్రయిస్తూ ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు.

జీవన విధానంలో మార్పులతో..

గతంలో గిరి రైతులు పండించే చిరు ధాన్యాలను వారి అవసరాలకు మాత్రమే ఉపయోగించేవారు. మిగిలిన వాటిని దాచుకునేవారు. వీటిని ఎవ్వరూ పెద్దగా పట్టించుకునేవారు లేక చిరుధాన్యాల సాగుపై ఆసక్తి కనబరిచేవారు కాదు. ఎంత కష్టపడి పండించినా కనీసం శ్రమకు తగిన ఫలితం కూడా ఉండేది కాదు. ప్రస్తుతం మానవ జీవన విధానంలో మార్పులు ఏర్పడ్డాయి. ప్రతీ రోజు ఆహారంలో చిరుధాన్యాలను తీసుకోవాలన్న వైద్యుల సూచనల మేరకు వాటికి మంచి గిరాకీ ఏర్పడింది.

వైద్యుల సూచనలతో ప్రాధాన్యం

ఆరోగ్యంలో చోటు చేసుకుంటున్న పరిణామాల తరుణంలో మధుమేహం, బీపీ తదితర దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నారు. చిరుధాన్యాలైన సామ బియ్యం, కొర్రలు, రాగులు, అండు బియ్యం వంటి వాటిని ప్రతీ రోజు ఆహారంలో చేర్చాలని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులతోపాటు అందరూ ప్రతీ రోజు తీసుకునే ఆహారంలో చిరుధాన్యాలకు ప్రాధాన్యమిస్తున్నారు. దీంతో వీటిని పండించే గిరి రైతులకు పరిస్థితులు కలిసివచ్చాయి. ప్రస్తుతం రాగులు, సామ బియ్యం, ఇతర చిరుధాన్యాల కోసం వ్యాపారులు గ్రామాలకు వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

చిరుధాన్యాల ధరలు (కిలో)

సామ బియ్యం	:	రూ.160
కొర్ర బియ్యం	:	రూ.140
ఊద బియ్యం	:	రూ. 140
అరక బియ్యం	:	రూ.140
అందు కొర్రలు	:	రూ.360
సజ్జలు	:	రూ.160
ఇసుక రవ్వ	:	రూ.130
దంపుడు బియ్యం	:	రూ.100
రాగులు (చోడి)	:	రూ.60
రాగులు(చోడి)	:	రూ.80
అవిసె గింజలు	:	రూ.240

అటవీ వ్యవసాయ ఉత్పత్తుల ధరలు

రాజ్‌మా	:	రూ.280
కుంకుడు	:	రూ.160
సీకాయ	:	రూ.200
ఉసిరి	:	రూ.400
కరక్కాయ	:	రూ.200
పసుపు కొమ్ము	:	రూ.200
తానికాయలు (50 గ్రాములు)	:	రూ.20
నల్ల జీడీ (100 గ్రాములు)	:	రూ.20
ఆవాలు	:	రూ.200
వస కొమ్ములు (50 గ్రాములు)	:	రూ.20
అరకు కాఫీ పొడర్ (200 గ్రాములు)	:	రూ.170

వ్యాపారులు ప్రోత్సహిస్తున్నారు



గతంలో సామలు, రాగులు, ఇతర చిరు ధాన్యాలను కేవలం కిలో రూ.10కు మించి కొనుగోలు చేసేవారు కాదు. ప్రస్తుతం వాటి ధర రూ.30కు పైగా ఉంది. చిరు ధాన్యాల సాగును వ్యాపారులు ప్రోత్సహిస్తున్నారు. వారే సాగు పెట్టుబడికి సొమ్ము ఇస్తున్నారు. దీంతో గతం కంటే ప్రస్తుతం చిరు ధాన్యాల సాగు విస్తీర్ణం పెరిగింది. మంచి ఆదాయం కూడా పొందుతున్నాం.

– కొర్రా సొన్ను, బి.గంగగుడ్డి, అరకులోయ మండలం

ఉపాధి పొందుతున్నాం



అరకులోయ గిరిజన మ్యూజియంలోని ఒక గదిలో అధికారుల సహకారంతో చిరు ధాన్యాల విక్రయ కేంద్రం ఏర్పాటు చేశాం. మన్యంలోని గ్రామాలకు వెళ్లి రైతుల నుంచి రాగులు, సామ. కొర్ర బియ్యం, ఇతర చిరు ధాన్యాలు, వ్యవసాయ ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాం. వీటిని అక్కడి నుంచి తీసుకువచ్చి విక్రయిస్తున్నాం. చిరుధాన్యాలకు రోజురోజుకు ఆదరణ పెరగడం వల్ల ఉపాధి లభిస్తోంది. అన్ని రకాలు స్టాల్‌లో అందుబాటులో ఉంచాం.

– జన్ని జమున, శరభగుడ, అరకులోయ

న్యూస్‌రీల్

ఓవర్ లోడింగ్ తగదు

- ఆటో డ్రైవర్లకు రంపచోడవరం ఆర్టీవో రాజేష్‌కుమార్ సూచన
- పట్టించుకోకుంటే చట్ట ప్రకారం చర్యలు



వేటమామిడి వద్ద వాహనాల రికార్డులను తనిఖీ చేస్తున్న ఆర్టీవో రాజేష్‌కుమార్

అడ్డతీగల: ఆటో డ్రైవర్లు ఓవర్ లోడింగ్ మానుకోవాలని రంపచోడవరం ఆర్టీవో ఆర్.రాజేష్‌కుమార్ అన్నారు. అడ్డతీగలలో మంగళవారం ఆయన జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓవర్ లోడింగ్‌లో వెళ్తున్నప్పుడు ఏదైనా ప్రమాదం జరిగితే ఎక్కువమంది గాయపడడం లేదా మరణాలు సంభవిస్తున్నాయన్నారు. ర్యాష్ డ్రైవింగ్ చేయవద్దన్నారు.వాహనం అదుపులో ఉంటే ఎటువంటి ప్రమాదం ఎదురైనా కంట్రోల్ చేయగలుగుతారన్నారు.ఇన్సూరెన్స్, ఫిట్నెస్ చేయించుకుని పర్మిట్లు ఫోర్స్‌లో పెట్టుకోవాలన్నారు. రోడ్డు రవాణా నిబంధనలు అనుసరించి వాహనం నడపాలని, లేకుంటే కేసు నమోదు చేసి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనంతరం అడ్డతీగల శివారు పెట్రోల్‌బంక్, వేటమామిడి వద్ద మంగళవారం ఆయన విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. నాలుగు వాహనాలకు రూ.78 వేల జరిమానా విధించినట్టు ఆయన తెలిపారు.

మావోయిస్టు యాక్షన్ టీంల సంచారంపై పోస్టర్లు

- అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు పోలీసుల సూచన



పోలీసులు అంటించిన పోస్టర్లు

కొయ్యూరు: మావోయిస్టు యాక్షన్ టీంలు తిరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంప పోలీసు స్టేషన్ పరిధిలో మంగళవారం పోస్టర్లను పోలీసులు అంటించారు. యాక్షన్ టీం సభ్యులను పట్టించిన వారికి రూ.5 నుంచి పది లక్షల వరకు నజరానా ఇస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా మంప ఎస్ఐ శంకర్‌రావు మాట్లాడుతూ యాక్షన్ టీంలు సంచరిస్తున్న సమాచారం తమ వద్ద ఉందన్నారు. దీనిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కూంబింగ్‌ను ఉధృతం చేశామని ఆయన వివరించారు.

మన్యంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలు



చింతపల్లిలో దట్టంగా కురుస్తున్న మంచు

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో గత మూడు రోజుల నుంచి ఉష్ణోగ్రతలు క్రమేపీ పెరుగుతున్నాయి. గత వారం సింగిల్ డిజిట్‌కు ఉష్ణోగ్రతలు తగ్గడంతో చలితీవ్రత అధికంగా ఉండేది. సుమారు నాలుగు నుంచి 8డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యేవి. ప్రస్తుతం ఉష్ణోగ్రతలు పెరుగుతుండడంతో చలిగాలులు కాస్త తగ్గాయి.జిల్లా కేంద్రం పాడేరుతో పాటు అన్ని ప్రాంతాల్లో పొగమంచు మాత్రం దట్టంగా కురుస్తోంది. వాహన చోదకులు ఉదయం 9గంటల వరకు హెడ్‌లైట్ల వెలుగులో రాకపోకలు సాగిస్తున్నారు.

చింతపల్లి: పాడేరు డివిజన్‌లోని జి మాడుగులలో మంగళవారం 9.7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదైనట్టు స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. అనంతగిరిలో 12.6, పెదబయలులో 12.6, డుంబ్రిగుడలో 12.8,చింతపల్లిలో 13.5, జీకే వీధిలో 13.7, పాడేరులో 13.9, అరకువేలీలో 14.0,హుకుంపేటలో 14.1, కొయ్యూరులో 17.5 డిగ్రీలు నమోదైనట్టు ఆయన పేర్కొన్నారు.



జి.మాడుగుల రోడ్డులో కురుస్తున్న పొగమంచు

31న రంపచోడవరంలో జాబ్ మేళా

రంపచోడవరం : ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం మరియు సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఈనెల 31వ తేదీన జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివద్ధి అధికారి రోహిణి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు జరిగే ఈ మేళాలో ఐదు కంపెనీల ప్రతినిధులు పాల్గొంటున్నట్టు ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని 18 సంవత్సరాల నుంచి 35 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉండి టెన్త్, ఇంటర్, డిగ్రీ ఆపై చదువు పూర్తి చేసిన యువతీ యువకులు జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు పాన్ కార్డు,ఆధార్ కార్డుతోపాటు సర్టిఫికెట్ల జెరాక్స్ కాపీలు తీసుకురావాలని ఆమె సూచించారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10 వేల నుంచి రూ.16 వేల వరకు వేతనం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 6304634447, 9398338105 నంబర్లలో సంప్రదించాలని ఆమె కోరారు.

గిరిజనుడిపై అడవిపంది దాడి

- తీవ్ర గాయాలు
- రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలింపు



విష్ణుదొర కాలుపై తీవ్ర గాయం

గంగవరం: మండలంలోని దోనెలపల్లిలో బి.విష్ణుదొర అనే గిరిజనుడిపై అడవిపంది దాడిచేసి తీవ్రంగా గాయపర్చింది. మంగళవారం జరిగిన ఈ సంఘటన వివరాలిలా ఉన్నాయి. పొలంలోకి వెళ్లిన విష్ణుదొరపై అక్కడే పిల్లలతో ఉన్న అడవిపంది దాడిచేసింది. ఈ ఘటనలో కాలిపై తీవ్ర గాయం అయినట్టు స్థానికులు తెలిపారు. వెంటనే బంధువులు,గ్రామస్తులు 108 వాహనంలో అతడిని గోకవరం సీహెచ్‌సీకి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరరలించారు.

గిరిజన సంస్కృతికి అద్దంపట్టేలా అరకు చలి ఉత్సవాలు



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, తదితరులు



హెలీ టూరిజం పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, పీవో అభిషేక్

- ఈనెల 31 నుంచి మూడు రోజులపాటు నిర్వహణ
- ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేయాలి
- కలెక్టర్ దినేష్‌కుమార్
- ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

అరకులోయ టౌన్: గిరిజన సంస్కృతీ సంప్రదాయాలు ఉట్టిపడేలా అరకు చలి ఉత్సవాలు నిర్వహించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో ఈనెల 31, వచ్చే నెల 1,2 తేదీల్లో చలి ఉత్సవాల నిర్వహణపై మంగళవారం పున్నమి హరిత వేలీ రిసార్ట్స్‌లో అధికారులతో సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా అధికారులు చేపట్టాల్సిన పనులపై ఆయన దిశానిర్దేశం చేశారు. ప్రతిఒక్కరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కోరారు. ట్రాఫిక్ అంతరాయం లేకుండా పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రదర్శన స్టాళ్లు, సౌండ్ సిస్టమ్, మారథన్ ర్యాలీ, తదితర కార్యక్రమాలకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. ఉత్సవాలు జరిగే మూడు రోజులు పారిశుధ్యం మరింత మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని పంచాయతీ రాజ్ అధికారులకు సూచించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆశాఖ అధికారులను ఆదేశించారు. పెయింటింగ్ పోటీలు నిర్వహించడమే కాకుండా, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గిరిజన వంటకాలు చేసి విక్రయించాలన్నారు. ఉత్సవం మొదటి రోజు డిగ్రీ కళాశాల నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు మారథన్ నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా బొర్రా జంక్షన్ నుంచి అరకు డిగ్రీ కళాశాల వరకు సైకిల్ ర్యాలీ ఉంటుందన్నారు. అరకు చలి ఉత్సవాలకు ఏడు వేల నుంచి పది వేల మంది పర్యాటకులు హాజరయ్యే అవకాశం ఉందని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం హెలీ టూరిజం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జేసీ ఎంజే అభిషేక్‌గౌడ్, ఐటీడీఏ పీవో వి. అభిషేక్, సబ్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్, టీడబ్ల్యూ ఈఈలు వేణుగోపాల్, డేవిడ్ రాజు, డీఆర్‌డీఏ పీడీ మురళి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి నందు, టూరిజం క్యూరేటర్ మురళి, ఉద్యానవన అధికారి రమేష్‌కుమార్‌రావు, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీపీఆర్వో గోవిందరాజులు, తహసీల్దార్ ఎంపీపీ ప్రసాద్, ఎంపీడీవో అడపా లవరాజు, ఈవెంట్ మేనేజర్లు పాల్గొన్నారు.

కార్యకర్తల జోలికి వస్తే సహించం

- వైఎస్సార్‌సీపీ నేత, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ హెచ్చరిక
- రాజవొమ్మంగిలో కార్యకర్తల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్

రాజవొమ్మంగి: కూటమి ప్రభుత్వం వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను టార్గెట్ చేస్తే సహించేది లేదని ఎమ్మెల్సీ అనంత ఉదయ భాస్కర్ (అనంతబాబు) హెచ్చరించారు. మంగళవారం రాజవొమ్మంగిలో జరిగిన పార్టీ నేతలు, కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయనతోపాటు మాజీ ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడారు. వైఎస్సార్‌సీపీకి ప్రజాబలం ఎంతో ఉందని, ఏ ఒక్క కార్యకర్త అధైర్యపడొద్దని తాము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. పార్టీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి పార్టీలతో సంబంధం లేకుండా అహర్నిశలు కృషి చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను టార్గెట్ చేస్తూ ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. అధికారులు తమ విధులు, బాధ్యతలను నిబంధనల ప్రకారం నిర్వర్తించాలని, ప్రొటోకాల్ పాటించాలని కోరారు. పంచాయతీలో సర్పంచ్‌ను కాదని అభివృద్ధి పనులు ప్రారంభించడం, తీర్మానం లేకుండా ఉపాధి హామీ పనులు ఇష్టానుసారంగా మంజూరు చేయడం తగదన్నారు. ఏ మండలంలో చూసినా ఒకరిద్దరు తప్ప అందరూ వైఎస్సార్‌సీపీకు చెందిన ప్రజాప్రతినిధులే ఉన్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించిందన్నారు. సూపర్ 6 హామీలను నమ్మి అమాయక ప్రజలు మోసపోయారన్నారు. కూటమి ప్రభుత్వం ఆరునెలలకే చతికిల బడిందన్నారు. మాజీ ఎమ్మెల్యే, పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ధనలక్ష్మి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారంజక పాలన అందించిందన్నారు. ప్రజలే కూటమి ప్రభుత్వానికి చరమ గీతం పాడతారన్నారు. కార్యకర్తలకు ఏ అవసరం లేదా ఆపద వచ్చినా ఎల్లవరంలో పార్టీ కార్యాలయానికి ఫోన్ చేయాలని, లేకుంటే స్వయంగా రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, వైస్‌ఎంపీపీలు చప్పా చంద్రరాణి, రాజేశ్వరి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు శింగిరెడ్డి రామకృష్ణ, జిల్లా కార్యదర్శి దాట్ల వెంకటేష్‌రాజు, మండల ఇన్‌చార్జ్/ అడ్డతీగల జెట్పీటీసీ సభ్యుడు వీర్రాజు, సర్పంచ్‌లు చీడి శివ, కొంగర మురళీకృష్ణ, ఆగూరి శుభలక్ష్మి, భీంరెడ్డి శుభలక్ష్మి, మిరియాల గణలక్ష్మి, కించు వెంకటలక్ష్మి, సవిరెల చంద్రుడు, సత్యనారాయణ, ఎంపీటీసీలు గంగదుర్గ, నిర్మలాదేవి, అచ్చియమ్మ, లోవకుమారి, పార్టీ నేతలు పాల్గొన్నారు.

గిరిజన చట్టాలను కాలరాస్తే ప్రజాగ్రహం తప్పదు

- స్పీకర్ అయ్యన్నపాత్రుడి వ్యాఖ్యలపై సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స ధ్వజం
- బాక్సైట్ తవ్వకాలు జరిపేందుకు కొత్త డ్రామా అని విమర్శ
- రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలని డిమాండ్



పాడేరు రూరల్: స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అప్పల నర్స డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం కేంద్రంగా నిర్వహించిన ప్రాంతీయ పెట్టుబడిదారుల సదస్సులో గిరిజన ప్రాంతంలో 1/70 చట్టం సవరణతోనే గిరిజన ప్రాంతాల్లో పెట్టుబడులు వస్తాయని హేలనగా మాట్లాడటం సరికాదన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన బాధ్యతగల పదవిలో ఉండి ఇటువంటి వ్యాఖ్యలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ గిరిజన చట్టాలు, హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తే ప్రజాగ్రహం తప్పదని హెచ్చరించారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ఒక్క టూరిజం ద్వారానే సాధ్యమన్న తప్పుడు ప్రకటనను మానుకోవాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజన ప్రాంతాలను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. 1/70 చట్టం వల్ల బాక్సైట్ తవ్వకాలకు అడ్డువస్తుందనే సాకుతోనే గిరిజనులకు గుండెకాయలాంటి 1/70 చట్టాన్ని సవరణ చేయాలని స్పీకర్ కొత్త డ్రామాకు తెరలేపారన్నారు. గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు గిరిజన సలహా మండలిలో బాక్సైట్ తవ్వకాల కోసం 1/70 చట్టాన్ని సవరణ చేస్తూ తీర్మానం కూడా చేసిందని గుర్తు చేశారు.అప్పటి తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యే సున్నం రాజయ్య దీనిపై తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. ఆదివాసీ నిరుద్యోగులకు ఉద్యోగ ఉపాధి కల్పించేందుకు చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేయవచ్చన్నారు. ప్రజల కోసం చేసేదేమీ లేకపోవడంతో గిరిజన హక్కుల చట్టాలను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నడం దారుణమని ఆయన పేర్కొన్నారు.

నాలుగు బర్త్ వెయిటింగ్ హాళ్లకు నిధుల మంజూరు



మాట్లాడుతున్న డీఈ రఘునాథరావు

చింతపల్లి: స్థానిక సబ్‌డివిజన్‌లోని నాలుగు పీహెచ్‌సీల పరిధిలో బర్త్ వెయిటింగ్ హాళ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు అయినట్టు టీడబ్ల్యూ డీఈ వి.రఘునాథరావు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చింతపల్లి మండలంలో బలపం, జీకేవీధి మండలంలో పెదవలస,జెర్రెల, సీలేరు పీహెచ్‌సీ పరిధిలో ఒకటి మంజూరు అయ్యాయన్నారు. ఒకొక్క భవనానికి రూ.35 లక్షలు మంజూరు అయ్యాయని ఆయన వివరించారు. తాజంగి గిరిజన మ్యూజియం పనులకు కొత్తగా టెండర్లు పిలిచినట్టు ఆయన వివరించారు. ఈ సమావేశంలో ఏఈఈ యాదగిరి కిషోర్, శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వీవోఏల ఆందోళన

పాడేరు ఐటీడీఏ ఎదుట రిలే దీక్షలు ప్రారంభం



వెలుగు వీవోఏల ధర్నాలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చిన్నయ్యపడాల్

సాక్షి, పాడేరు: ఎనిమిది నెలల బకాయి వేతనాలు చెల్లించాలని, మూడేళ్ల ఉద్యోగ కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేయాలని వెలుగు యానిమేటర్లు (వీవోఏలు) డిమాండ్ చేశారు. స్థానిక ఐటీడీఏ ఎదుట మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా చేపట్టిన రెండు రోజుల దీక్షలను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొనంగి చిన్నయ్యపడాల్ ప్రారంభించారు. పాడేరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో పనిచేస్తున్న యానిమేటర్లు అందరూ పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత చిన్నయ్యపడాల్ మాట్లాడుతూ ప్రతిపక్ష నేతగా అనేక హామీలు ఇచ్చిన చంద్రబాబు సీఎం అయ్యాక వాటిని కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. డ్వాక్రా సంఘాలను సమన్వయం చేస్తూ విధి నిర్వహణలో శ్రమిస్తున్న వెలుగు యానిమేటర్ల సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం విస్మరించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎనిమిది నెలలుగా జీతాలు ఇవ్వకుంటే కుటుంబాలతో ఎలా జీవిస్తారని ఆయన ప్రశ్నించారు. వెంటనే వేతన బకాయిలు చెల్లించడంతోపాటు మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో నిర్లక్ష్యం చేస్తే పోరాటం ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యానిమేటర్ల సంఘ ప్రతినిధులు భాను, రాజకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైభవంగా గంగమ్మతల్లి ఉత్సవాలు



పేటమాలిపుట్టులో గంగమ్మతల్లి విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని దార్రెల పంచాయతీ పేటమాలిపుట్టులో గంగమ్మతల్లి ఉత్సవాలు వైభవంగా జరిగాయి. సోమవారం రాత్రి గిరిజన ఆచార సంప్రదాయాల ప్రకారం బుడియాలు సందడి చేశారు.సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాండోల్లి కట్టి దేవత విగ్రహాలను గ్రామంలోని వీధుల్లో ఉయ్యాలలో ఊరేగించారు.కర్రలతో ఒంటెలు,ఏనుగులు,ఏలుగుబంట్లను తయారు చేసి విన్యాసాలు చేశారు. మంగళవారం తెల్లవారు జాము నుంచే అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. భక్తులకు అసౌకర్యం కలగుండా ఉత్సవ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

జైల్లో కొత్త బ్యాచ్‌లకు చేతి వృత్తుల్లో శిక్షణ

ఆరిలోవ(విశాఖ): విశాఖ కేంద్ర కారాగారంలో ఖైదీలకు వివిధ చేతి వృత్తుల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇందులో భాగంగా ఈ నెల 25న రెండు వృత్తుల్లో శిక్షణ పొందిన బ్యాచ్‌లకు పరీక్షలు జరిగాయి. మరో రెండు, మూడు రోజుల్లో కొత్త బ్యాచ్‌లు ప్రారంభంకానున్నట్లు జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్.సాయిప్రవీణ్ తెలిపారు. ఇక్కడ ప్లంబింగ్, వెల్డింగ్ కోర్సుల్లో 40 మంది చొప్పున రిమాండ్ ఖైదీలకు రెండు నెలల పాటు శిక్షణ అందించామన్నారు. శిక్షణ పొంది, పరీక్షలు రాసిన వారికి సర్టిఫికెట్లు కూడా అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆ సర్టిఫికెట్లు బాహ్య ప్రపంచంలో వారికి చేతి వృత్తుల్లో ఉపయోగపడతాయన్నారు. రెండు మూడు రోజుల్లో ప్రారంభం కానున్న కొత్త బ్యాచ్‌లలో 45 మంది చొప్పున శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

అట్టహాసంగా స్పోర్ట్స్ మీట్



ఉత్సాహంగా బాలుర పరుగు పోటీ

- పాలిటెక్నిక్ స్పోర్ట్స్ మీట్‌కు 13 జిల్లాల క్రీడాకారులు
- అథ్లెటిక్స్‌తో పాటు ఆరు క్రీడాంశాల్లో పోటీలు



శాంతి కపోతాలను గాలిలో ఎగురవేసి స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభిస్తున్న అతిథులు

విశాఖ స్పోర్ట్స్ : కంచరపాలెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలో 27వ ఇంటర్ పాలిటెక్నిక్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. రాష్ట్రంలోని 13 జిల్లాలకు చెందిన 720 మంది బాలురు, 510 మంది బాలికలు అథ్లెటిక్స్‌తో పాటు ఆరు క్రీడాంశాల్లో పోటీపడనున్నారు. వాలీబాల్, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, బ్యాడ్మింటన్, టీటీ, చదరంగంతో పాటు అథ్లెటిక్స్ ట్రాక్, ఫీల్డ్ అంశాల్లోనూ మూడు రోజుల పాటు జరిగే ఈపోటీలో 138 ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్స్‌కు చెందిన విద్యార్థులు ప్రాంతీయ జట్లుగా తలపడనున్నారు. ఆయా జట్ల సభ్యుల నుంచి అతిథులు గౌరవవందనాన్ని స్వీకరించారు. డిఫెండింగ్ చాంప్ కృష్ణా జట్టు నుంచి ఆతిథ్య జట్టు విశాఖతో సహా 13 రీజియన్ జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. కృష్ణా జట్టుకు జయకుమార్, అనంతపురానికి మహేష్, చిత్తూరుకు గిరిబాబు, తూర్పుగోదావరికి చిరంజీవి, గుంటూరుకు దేముడు, కడపకు హేమంత్‌రెడ్డి, కర్నూలుకు త్రిమూర్తి, నెల్లూరుకు తరుణి, ప్రకాశంకు నిఖిల్, శ్రీకాకుళానికి శివరామకృష్ణ, విజయనగరానికి లక్ష్మి, పశ్చిమగోదావరి జట్టుకు అవినాష్, విశాఖ జట్టుకు హేమంత్ కంటింజెంట్ లీడర్‌గా వ్యవహరించారు. క్రీడా జ్యోతి వెలిగించిన అనంతరం ఆయా జట్ల కెప్టెన్లు ప్రతిజ్ఞ చేశారు. అతిథులు శాంతికపోతాలను గాల్లోకి విడవగా ముఖ్యఅతిథి మీట్ ప్రారంభాన్ని ప్రకటించారు. గేమ్స్ బాలుర విభాగంలో అప్పర్‌పూల్‌లోని అనంతపురం రీజియన్‌తో కర్నూలు రీజియన్ జట్ల మధ్య వాలీబాల్‌పోటీని...అథ్లెటిక్స్ ట్రాక్ ఈవెంట్‌లో భాగంగా బాలబాలికలకు 800 మీటర్ల పరుగును ప్రారంభించారు. అథ్లెటిక్స్‌లో బాలబాలికలకు స్ప్రింట్ అంశాలతో పాటు 800 మీటర్ల పరుగు, జంప్స్, త్రోస్ నిర్వహించనుండగా బాలురకు 1,500 మీటర్ల పరుగు, వంద, 400 మీటర్ల రిలే పరుగును నిర్వహించనున్నారు.

క్రీడలతో ఆరోగ్యం

క్రీడాపోటీలను పోటీలను ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యం సిద్ధిస్తుందన్నారు. భారత్ శక్తి యువతేనని, సాంకేతికతను అందిపుచ్చుకుని మరింత ముందుకు సాగాలని సూచించారు. గౌరవ అతిథిగా హాజరైన సాంకేతిక విద్య సంయుక్త సంచాలకుడు వి.పద్మారావు మాట్లాడుతూ ఏటా ఒక్కో రీజియన్‌లో ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. గతేడాది అనంతపురంలో నిర్వహిస్తే ఈసారి విశాఖలో నిర్వహిస్తున్నామని చెప్పారు. పోటీల్లో విజేతలు దక్షిణ భారతంలోని అంతర రాష్ట్ర పాలిటెక్నిక్ ఆటల పోటీలకు అర్హత సాధిస్తారన్నారు. తొలుత విశాఖ ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ నారాయణరావు మాట్లాడుతూ క్రీడలంటే గెలుపోటములే కాదని ఓటమిలోనూ పాఠం నేర్చుకోవడమే అన్నారు. కాకినాడ, తిరుపతి ప్రాంతీయ సంయుక్త సంచాలకులు సత్యనారాయణ, నిర్మల కుమార్ ప్రియ, సాంకేతిక విద్య, శిక్షణ మండలి కార్యదర్శి జీవీ రామచంద్రరావు, డిప్యూటీ డైరెక్టర్ విజయ భాస్కర్, సాంకేతిక విద్యాశాఖ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంటు డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఎంఏవీ రామకృష్ణ, స్పోర్ట్స్ మీట్ సహ సమన్వయాధికారి డాక్టర్ బి.జానకీరామ్, వివిధ కాలేజీల ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.



నువ్వా నేనా అన్నట్టు బాలికల పరుగు పోటీ



అనంతపురం, కర్నూల్ జట్ల మధ్య హోరాహోరీగా వాలీబాల్ మ్యాచ్

రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

- ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



ఎర్రంపాలెం ఆశ్రమపాఠశాల విద్యార్థినులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో సింహాచలం



నర్సాపురం పీహెచ్‌సీ రికార్డులు తనిఖీ చేస్తున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం: ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలందించాలని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్ట సింహాచలం ఆదేశించారు. నర్సాపురం పీహెచ్‌సీని ఆయన మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఎంతమంది వైద్యాధికారులు,సిబ్బంది ఉన్నారు, ప్రతిరోజు ఎంతమంది రోగులు ఆస్పత్రికి వస్తున్నారో అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోగులకు వైద్య సేవలందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని సూచించారు. అనంతరం కె.ఎర్రంపాలెం గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ బాలికల పాఠశాలను పీవో సందర్శించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతిరోజు మెనూ అమలు చేయాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పోక్స్ పేట గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. గ్రామ రెవెన్యూ అధికారి (వీఆర్‌వో) జమున విధులకు గైర్హాజరు కావడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

సాగో దుంపల లోడు వాహనాన్ని అడ్డుకున్న రైతులు

ధర నిర్ణయించకుండా తరలింపుపై ఆగ్రహం



వ్యాన్‌ను అడ్డుకుని ఆందోళన చేస్తున్న రైతులు, ఉపసర్పంచ్ వెంకటేశ్వరరావు దొర తదితరులు

గంగవరం : గిట్టు బాటు ధర నిర్ణయించకుండా గిరిజన రైతులను మభ్యపెట్టి సాగో దుంపలను తరలిస్తుండగా ఓ వాహనాన్ని రైతులు అడ్డుకున్నారు. మంగళవారం పోతురాజుబాబు గుడి సమీపంలో దుంపల లోడుతో ఉన్న వ్యాన్‌ను రైతులు అడ్డుకుని, స్థానిక ఉపసర్పంచ్ పరదా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఉపసర్పంచ్ వెంకటేశ్వరరావు దొర, రైతులు రాజు, నరసింహ రావు తదితరులు మాట్లాడుతూ సాగో దుంపలకు మిల్లుల యజమానులు ఇంకా ధర నిర్ణయించలేదని, ధర నిర్ణయించాకే రవాణా చేయాలని నిర్ణయించుకున్నామన్నారు. గిట్టుబాటు ధర కోసం మిల్లు యజమానులు, వ్యాపారులు, రైతులు మధ్య చర్చలు జరగాల్సి ఉందన్నారు. ఇంతలో ఓ దళారి దొరమామిడి గ్రామానికి చెందిన గిరిజన రైతులను మభ్యపెట్టి పెద్దాపురం మిల్లుకు దుంపల లోడును రవాణా చేయడానికి సిద్ధపడినట్టు చెప్పారు. సరైన గిట్టుబాటు ధర లభించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. గత ఏడాది పుట్టు (230 కిలోలు) రూ.1,600కు కొనుగోలు చేశారని, ఈ ఏడాది కనీస గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేశారు.

బాలుడి ఆరోగ్యంపై తల్లిదండ్రుల ఆందోళన



వెంటిలేటర్‌పై బాలుడు

మహారాణిపేట (విశాఖ): చింతపల్లి మండలం చౌడుపల్లి పంచాయతీ చౌటపాడు గ్రామానికి చెందిన బూర్జ గణపతి, జేమ్స్‌కు మూడో సంతానంగా మగపిల్లాడు జన్మించాడు. 18 నెలల ఆ బాలుడు వృషణాల వాపుతో బాధ పడుతుండడంతో శుక్రవారం కేజీహెచ్ పిల్లల వార్డులో చేర్పించారు. శనివారం బాలుడికి శస్త్రచికిత్స చేశారు. ఆ సమయంలో గుండె నొప్పి రావడంతో బాలుడు కోమాలోకి వెళ్లిపోయాడని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స కొనసాగుతోంది. ఇంకా బాలుడి హార్ట్ బీట్ నమోదవుతుందని వైద్యులు చెబుతున్నారు. బాలుడి చికిత్సపై తమకు అనుమానాలు ఉన్నాయని, అప్పటి వరకు ఎంతో ఆరోగ్యంగా ఆడుకున్న బాలుడు ఎలా కోమాలోకి వెళ్లిపోతాడని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. వైద్యులు మాత్రం బాలుడి వృషణం మెలిక పడి రక్త ప్రసరణ ఆగిపోయిందని చెబుతున్నారు. శస్త్ర చికిత్స చేసి రక్త ప్రసరణ జరిగేలా వైద్యులు ప్రయత్నిస్తున్నారు.

ఆస్పత్రుల్లో ప్రసవాలతో మేలు

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ పద్మావతి



డుంబ్రిగుడ పీహెచ్‌సీలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఆరోగ్య శాఖ డైరెక్టర్ పద్మావతి

డుంబ్రిగుడ: గిరిజన గ్రామాల్లో మాతాశిశు మరణాల నివారణలో భాగంగా ఆస్పత్రిలో ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ డైరెక్టర్ పద్మావతి సూచించారు. మంగళవారం ఆమె డుంబ్రిగుడ, కిల్లోగుడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను తనిఖీ చేశారు. మందులు భద్రపరిచే గది, ప్రసవ గదులతో పాటు బాలింతల వార్డు, శిశుజనన నిరీక్షణ కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం రికార్డులను తనఖీ చేసి గర్భిణులకు అందుతున్న భోజన మెనూ వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు గిరిజనుల పాలిట దేవాలయాలన్నారు. వీటి సేవలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండి గిరిజనులకు వైద్య సేవలు అందించాలని సూచించారు. అనంతరం కిల్లోగుడ పీహెచ్‌సీని సందర్శించిన ఆమె గిరిజనులకు అందుతున్న వైద్యం సేవల వివరాలు తెలుసుకున్నారు. ఎట్టి పరిస్థితిలో ఇళ్లల్లో ప్రసవాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జమాల్ బాషా, డుంబ్రిగుడ, కిల్లోగుడ వైద్యాధికారులు పి. రాంబాబు, అంబిక, నజీజ్ పాల్గొన్నారు.



నేడే అప్పన్న తెప్పోత్సవం

- విజయవంతంగా ట్రయల్‌రన్
- ముస్తాబైన వరాహ పుష్కరిణి



వరాహ పుష్కరిణిలో సిద్ధం చేసిన హంసాకార తెప్పపై ట్రయల్ రన్ నిర్వహిస్తున్న ఎఫ్‌డీవో, దేవస్థానం ఇంజనీరింగ్ అధికారులు

సింహాచలం: పుష్య బహుళ అమావాస్య సందర్భంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం(నౌకావిహారం) బుధవారం సాయంత్రం వరాహ పుష్కరిణిలో జరగనుంది. హంస ఆకారంలో రూపొందించిన తెప్పపై స్వామివారు శ్రీదేవి, భూదేవి సమేతంగా నౌకా విహారం చేయనున్నారు. ఈ మేరకు విశాఖ ఫిషరీస్ డెవలప్‌మెంట్ అధికారి ఆశాజ్యోతి ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం ట్రయల్‌రన్ నిర్వహించారు. తెప్ప తీర్చిదిద్దిన తీరు, సామర్థ్యాన్ని పరిశీలించారు. ట్రయల్ రన్‌లో దేవస్థానం ఈఈ రాంబాబు, ఏఈ తాతాజీ పాల్గొన్నారు.

విశేషంగా ఏర్పాట్లు

తెప్పోత్సవ ఏర్పాట్లను దేవస్థానం ఈవో వి.త్రినాథరావు ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. హంస ఆకార తెప్పను పూలు, విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. పుష్కరిణి నలువైపులా విద్యుద్దీపకాంతులు ఏర్పాటు చేస్తున్నారు. పుష్కరిణి మధ్యలో స్వామి పూజలందుకునే మండపాన్ని తీర్చిదిద్దారు. పుష్కరిణి గట్టుపై సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. పుష్కరిణి వద్ద 15 మంది గజ ఈతగాళ్లను, రెండు అదనపు బోట్లను, 15 లైఫ్ జాకెట్లను అందుబాటులో ఉంచనున్నట్లు ఆలయ ఈఈ రాంబాబు తెలిపారు. 35 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు గోపాలపట్నం సీఐ గొలగాని అప్పారావు తెలిపారు.

వేణుగోపాల స్వామి అలంకరణలో..

తెప్పోత్సవంలో భాగంగా శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవ మూర్తి గోవిందరాజస్వామికి వేణుగోపాలస్వామి అలంకరణ చేసి శ్రీదేవి, భూదేవి సమేతంగా మెట్లమార్గంలో తీసుకొస్తారు. పుష్కరిణి వద్ద హంస వాహనంపై స్వామిని వేంజేపచేసి సాయంత్రం 5 గంటల నుంచి తెప్పోత్సవాన్ని నిర్వహిస్తారు. అనంతరం స్వామిని మండపంలో కొలువుంచి షోడశోపచార పూజలు నిర్వహిస్తారు. పుష్కరిణి సత్రం వద్దకు చేర్చి, సర్వజనమనోరంజని వాహనంపై రాత్రి అడవివరం గ్రామంలో తిరువీధి నిర్వహిస్తారు. అనంతరం స్వామిని తిరిగి సింహగిరికి చేరుస్తారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం తగదు

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం
- అరకు ఏరియా ఆస్పత్రి సిబ్బందికి సూచన



సమావేశానికి హజరైన వైద్య సిబ్బంది, తదితరులు

అరకులోయ టౌన్: రోగులకు వైద్యసేవలందించడంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శిస్తే ఉపేక్షించేది లేదని అరకులోయ ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం హెచ్చరించారు. మంగళవారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. వైద్యుల సేవలు అభినందనీయమని, వైద్య సిబ్బంది సేవలు సక్రమంగా అందడం లేదని రోగుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, క్షేత్ర స్థాయి సిబ్బంది సేవలు అంతంతమాత్రంగా ఉన్నాయన్నారు. మీరంతా గిరిజన ప్రాంత రోగులకు మెరుగైన సేవలు అందించాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. వైద్య సిబ్బంది ఎల్లప్పుడు రోగులకు మెరుగైన వైద్యం, స్నేహపూర్వకంగా వ్యవహరించినప్పుడే వారికి రోగం నయం అవుతుందన్నారు. ప్రభుత్వం అందించే సేవలను ప్రజలకు చేరువ చేయాలని, ఆస్పత్రికి వచ్చిన వారితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. ఆస్పత్రిలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు తన దృష్టికి లేదా ఆస్పత్రి సూపరింటెండెంట్ దృష్టికి తీసుకురావాలని కోరారు. ప్రతీ దానికి పోరాటం చేస్తే పరిష్కారం కాదన్నారు. వైద్య సిబ్బంది ఆస్పత్రి సూపరింటెండెంట్ సలహాలు సూచనలు పాటించి విధులు నిర్వర్తించాలన్నారు. వ్యక్తిగత నిర్ణయాలతో రోగులకు ఇబ్బందులు కలిగించవద్దని వారికి ఎమ్మెల్యే సూచించారు.

మహిళ అదృశ్యంపై ఫిర్యాదు



తప్పిపోయిన మహిళ గుర్రం నూకరత్నం

పాయకరావుపేట : పట్టణానికి చెందిన గుర్రం నూకరత్నం (49) అనే మహిళ రైలు ప్రయాణంలో తప్పిపోవడంతో గాలిస్తున్నట్లు తుని రైల్వే పోలీసుస్టేషన్ ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. నూకరత్నం ఈ నెల 25వ తేదీన తుని రైల్వేస్టేషన్‌లో సామర్లకోట వెళ్లడానికి రత్నాచల్ రైలు ఎక్కిందన్నారు. నూకరత్నం పాయకరావుపేటలో గల తల్లిదండ్రుల ఇంటికి పండగకు వచ్చి తిరిగి ఆమె స్వస్థలం సామరట్లకోట బయలుదేరింది. అయితే ఆమె ఇంటికి చేరుకోకపోవడంతో నూకరత్నం సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తుల అరెస్టు





మద్యంతో పట్టుబడిన వ్యక్తులతో ఎక్సైజ్ పోలీసులు

నర్సీపట్నం : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశామని ఎక్సైజ్ సీఐ కె.సునీల్ కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు నర్సీపట్నం మండలం, నెల్లిమెట్ట, మాకవరపాలెం మండలం, తామరంలో ప్రాంతాల్లో మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామని, వారి వద్ద నుండి 18 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. వైన్‌షాపుల నిర్వాహకులు అక్రమ మద్యం అమ్మకాలను ప్రోత్సహిస్తే లైసెన్స్‌లు రద్దు చేస్తామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ కిరణ్‌కుమార్, కానిస్టేబుల్ నారాయణ, బాబురావు, గోవర్ధన్ పాల్గొన్నట్టు సీఐ తెలిపారు.

ఖైదీల తరలింపు ప్రక్రియ ప్రారంభం

ఆరిలోవ(విశాఖ): విశాఖ కేంద్ర కారాగారంలోని ఖైదీలను వేరే జైలుకు తరలించే ప్రక్రియ మంగళవారం ప్రారంభమైంది. ఇది వారం రోజులపాటు కొనసాగనుంది. ఇక్కడ సామర్థ్యానికిమించి ఖైదీలు ఉండటంతో పరిపాలన సౌలభ్యంలో భాగంగా 200 మందిని రాజమహేంద్రవరం జైలుకు తరలించాలని రాష్ట్ర జైళ్ల శాఖ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా విశాఖ పోలీసుల ఎస్కార్టుతో మంగళవారం 20 మంది ఖైదీలను రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి వ్యాన్‌లో తరలించినట్లు జైల్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఎస్.సాయిప్రవీణ్ తెలిపారు.

స్టీల్‌ప్లాంట్‌కు కేంద్ర ఉక్కు మంత్రి రాక రేపు

ఉక్కునగరం: కేంద్ర ఉక్కుశాఖామంత్రి హెచ్‌డీకుమారస్వామి గురువారం స్టీల్ ప్లాంట్‌కు రానున్నారు. ఆ రోజు ఉదయం తిరుపతి నుంచి విశాఖ వస్తారు. విశాఖలో సెయిల్, బీటీఎస్‌వో అధికారులతో సమావేశమవుతారు. అనంతరం స్టీల్‌ప్లాంట్‌కు చేరుకుని, వివిధ ఉత్పత్తి విభాగాలను సందర్శించనున్నారు. సాయంత్రం 4.30కు స్టీల్‌ప్లాంట్ నుంచి బయల్దేరి, ఢిల్లీకి పయనమవుతారని అధికార వర్గాల సమాచారం. అయితే ఈ పర్యటనలో స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాలు, అసోసియేషన్లతో సమావేశం పట్ల ఎలాంటి అధికారిక సమాచారం లేకపోవడం గమనార్హం.

మేలు చేసే పోలీసులకు సహకరించాలి

బీఎస్ఎఫ్ 180 బెటాలియన్ కమాండెంట్ విజయ్‌కుమార్ పాండే



ఖల్‌గూడలో వైద్య శిబిరం నిర్వహిస్తున్న బీఎస్ఎఫ్ పోలీసులు

ముంచంగిపుట్టు: మేలు చేసే పోలీసులకు గిరిజనులు అన్నివిధాలుగా సహకరించాలని అద్రహల్ బీఎస్ఎఫ్ 180 బెటాలియన్ కమాండెంట్ విజయ్ కుమార్ పాండే అన్నారు. ఆంధ్ర ఒడిశా సరిహద్దు ప్రాంతంలోని అద్రహల్ బీఎస్ఎఫ్ 180 బెటాలియన్ పోలీసు బలగాలు మంగళవారం ఖల్‌గూడ గ్రామంలో సివిల్ యాక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు. సరైన రహదారి లేని ఈ గ్రామానికి సుమారు రెండు గంటల పాటు కాలినడకన కొండలు,గుట్టలు ఎక్కి సామగ్రిని మోసుకొని అతి కష్టం మీద పోలీసులు చేరుకున్నారు. విద్యార్థులకు పుస్తకాలు, గిరిజన యువకులకు వాలీబాల్ కిట్లు, వంటపాత్రలు, రగ్గులు, దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. సింధిగూడ, హుందిపాడ, బల్లియపాడ, కొంటంగూడ గ్రామాలకు చెందిన 231 మంది వైద్య సేవలు అందించారు. మందులు పంపిణీ చేశారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అద్రహల్ బీఎస్ఎఫ్ 180 బెటాలియన్ కమాండెంట్ విజయ్‌కుమార్ పాండే మాట్లాడుతూ మారుమూల గిరిజన గ్రామాల్లో సివిల్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా గిరిజనులకు సేవలు అందించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను తెలుసుకొని వాటి పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు. . ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ 180 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్లు సతేంద్రకుమార్‌పాత్రో, శైలేష్‌కుమార్, సునీల్‌కుమార్ యాదవ్, బీఎస్ఎఫ్ పోలీసులు పాల్గొన్నారు.

తండేల్ కలెక్షన్లు దుల్లగొట్టేయాలి



మాట్లాడుతున్న హీరో నాగచైతన్య

సీతంపేట(విశాఖ): విశాఖలో తండేల్ చిత్ర యూనిట్ సందడి చేసింది. చిత్రం ట్రైలర్‌ను రామాటాకీస్ హాల్లో హీరో నాగచైతన్య, చిత్ర సమర్పకుడు, ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్, దర్శకుడు చందు మొండేటి లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నాగచైతన్య మాట్లాడుతూ విశాఖ హార్బర్ పరిసరాల్లో చిత్ర షూటింగ్ జరిగిందని, విశాఖలో ట్రైలర్ లాంచ్ చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. ఏ సినిమా అయినా విశాఖలో టాక్‌బట్టే భవితవ్యం తేలిపోతుందన్నారు. విశాఖ అమ్మాయినే ప్రేమించి పెళ్లి చేసుకున్నా..తండేల్ సినిమా కలెక్షన్లు దుల్లకొట్టేయాలి అంటూ అభిమానులద్దేశించి అన్నారు. ఇప్పటికే విడులైన పాటలు చార్ట్ బస్టర్‌గా నిలిచాయని, దేవిశ్రీ అద్భుత బాణీలు అందించాడన్నారు. ఏడాదిన్నరగా తాను కూడా చైతూ జపం చేస్తున్నానని అల్లు అరవింద్ అన్నారు. చాలా కష్టపడి సినిమా తీశాం. ప్రేక్షకులకు కచ్చితంగా నచ్చుతుందన్నారు.